# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## తిరుపతి హైవేపై రోడ్డు ప్రమాదం

### ఆటో డ్రైవర్ మృతి



తిరుపతిరూరల్, జూలై 30 ప్రభాతవార్త:

తిరుపతి 200 హైవే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతకాల్వకు చెందిన ఆటో డ్రైవర్ కనుక చలం మృతి చెందారు. తిరుపతి గాజులమండలం గ్రామానికి చెందిన బలిజ రామయ్య (65) ఆటోతో ఎక్కించుకుని వెళ్ళుతుండగా రామానుజపల్లి చెక్ పోస్టు దాటిన తర్వాత బాలాజీ డైరీ దగ్గర బుధవారం మధ్యాహ్నం 1:00 గంట ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఆటో డ్రైవర్ కనుక చలం మృతి చెందాడు. ఆటోలో ప్రయణిస్తున్న బలిజ రామయ్య తీవ్ర గాయాలతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. తిరుపతిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివయ్య సేవలో విజిలెన్స్ కమిషనర్



శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్రపునీత్ కుటుంబసభ్యులతో దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ ఇఓ డి. బాపిరెడ్డి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితుల వేద మంత్రాలతో మేళతాళాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# ఇక శ్రీవాణి బ్రేక్ దర్శనం

### సాయంత్రం 4.30కి !

### -ఆఫ్‌లైన్ భక్తులకు ప్రయోగాత్మకంగా అమలు



తిరుమల, జూలై 30ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల, రేణిగుంట విమానాశ్రయాల్లో ఆఫ్‌లైన్‌లో జారీఅవుతున్న శ్రీవాణి బ్రేక్ దర్శన సమయంలో మార్పుచేస్తూ టిటిడి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇదివరకు శ్రీవాణి టిక్కెట్లు కలిగి ఉదయం 10గంటలకు వైకుంఠమ్ -1నుండి అనుమతించే భక్తులను రేపటి నుండి (ఆగస్ట్ 1)సాయంత్రం 4.30గంటలకు దర్శనానికి అనుమతించనున్నారు. ఏరోజుకారోజు ఆఫ్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు ఉదయం 10గంటల నుండి జారీచేస్తారు. దర్శనం వేళల్లో మార్పును బుధవారం టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి అధికారులకు సూచించారు. 15రోజులవరకు ఏరోజుకారోజు శ్రీవాణి బ్రేక్ దర్శనం టిక్కెట్లు జారీచేసి వారందరికీ సాయంత్రం 4.30గంటలకు ప్రయోగాత్మకంగా దర్శనం కల్పించడం అమలుచేస్తారు. ఆన్‌లైన్‌లో శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు పొందిన భక్తులకు మాత్రం యధావిధిగా ఉదయం 10గంటలకే దర్శనానికి అనుమతినిస్తారు. ఆఫ్‌లైన్‌లోరోజువారీగా జారీచేసే శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్ల సమాచారాన్ని డిజిటల్ స్క్రీన్ల ద్వారా తెలియజేస్తారు. భక్తులకు టీ, కాఫీ, పాలు, తాగునీరు, అల్పాహారం పంపిణీ చేస్తారు. ఈ విధివిధానాలపై బుధవారం ఉదయం గోకులం విశ్రాంతి భవనంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఐటి జిఎం శేషారెడ్డి, విఎస్‌ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లం సురేంద్ర, డిఎఫ్ఓ ఫణికుమార్‌నాయుడు, డిప్యూటీ ఈఓ వెంకటయ్య, ఐటి డిప్యూటీ జిఎం వెంకటేశ్వర్లునాయుడు, పిఆర్‌ఓ నీలిమతో కలసి టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్షించారు.

# ఇస్రో చరిత్రలో మరో మైలురాయి

### - జిఎస్‌ఎల్‌వి-ఎఫ్16 ప్రయోగం విజయవంతం

### - ప్రకృతి వైపరీత్యాల అధ్యయనానికి నిసార్ ప్రయోగం









సూళ్లూరుపేట, జులై 30 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం శ్రీహరికోట నుంచి బుధవారం ప్రయోగించిన జిఎస్‌ఎల్‌వి-ఎఫ్16 రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్ అయింది. జిఎస్‌ఎల్‌వి-ఎఫ్16 రాకెట్ ద్వారా ఇస్రో, నాసా సంయుక్త ఆధ్వర్యంలో తయారు చేసిన నిసార్ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. మంగళవారం మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ సజావుగా కొనసాగడంతో బుధవారం సాయంత్రం 5గంటల 40 నిమిషాలకు శ్రీహరికోటలోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి జిఎస్‌ఎల్‌వి-ఎఫ్16 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగికి ఎగిసింది. ఈ రాకెట్ 18 నిమిషాల 40 సెకన్లు 747 కిలోమీటర్లు ప్రయాణం చేసి గమ్యానికి చేరుకుంది. 2,392 కేజీల నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. గత పిఎస్‌ఎల్‌వి-సి61 ప్రయోగం విఫలమైన తర్వాత ప్రయోగం కావడంతో ఈ ప్రయోగంపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో అందరి అనుమానాలు పటాపంచలు చేస్తూ ఈ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. 11,200 కోట్లు వ్యయంతో అత్యంత ఖరీదైన నిసార్ ఉపగ్రహం ప్రకృతి వైపరీత్యాలపై ప్రత్యేక అధ్యయనం చేస్తుంది. నిర్దేశిత కక్ష్యలోకి 98.40 డిగ్రీల కోణంలో కక్ష్యలోకి ఈ ఉపగ్రహం చేరుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 12వ క్రయోజనిక్ స్టేజిని ఈ రాకెట్లో ఉపయోగించారు. ప్రకృతి వైపరీత్యాలపై తుపాను, సునామి, భూకంపాలు, మంచు పర్వతాల కదలికలపై సమగ్రమైన త్రీడీ చిత్రాలను స్పష్టమైన రిజల్యూషన్‌తో అందజేయడం ఈ ఉపగ్రహం ప్రత్యేకత. దీంతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించి కూడా ఉపగ్రహం సమాచారాన్ని అందిస్తుంది. ఈ ఉపగ్రహంలో నాసాకు సంబంధించి ఎల్ బ్యాండ్, ఇస్రోకి సంబంధించి ఎస్ బ్యాండ్‌ను అమర్చారు. 12 రోజుల వ్యవధిలోనే భూమిని చుట్టి వాతావరణానికి సంబంధించి సమాచారం చేరవేస్తుంది. నిసార్‌లోని రాడార్లు 80 టిబి డేటాను ఉత్పత్తి చేస్తాయి. సుమారు 150 నుంచి 512 జిబి హార్డ్‌డ్రైవ్‌లను నింపే డేటా ఈ ఉపగ్రహం అందజేస్తుంది. ఈ ఉపగ్రహం సుమారు 40 రోజుల్లో తన పనిని ప్రారంభించి సమగ్ర సమాచారాన్ని అందేవిధంగా శాస్త్రవేత్తలు రూపకల్పన చేశారు. ప్రయోగం ఘన విజయం సాధించడంతో ఇస్రో శాస్త్రవేత్తల సంబరాలు అంబరాన్నంటాయి. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ ఉన్ని కృష్ణన్, నాసా శాస్త్రవేత్తలతో పాటు షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర ఇస్రో అధికారులు సంబరాల్లో మునిగి తేలారు.

## సమష్టి కృషితో ప్రయోగం విజయవంతం

### - ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్



సూళ్లూరుపేట, జులై 30 ప్రభాతవార్త

ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు సమష్టి కృషితో జిఎస్‌ఎల్‌వి-ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ప్రయోగ విజయం అనంతరం ఆయన శాస్త్రవేత్తలతో కలిసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. జిఎస్‌ఎల్‌వి-ఎఫ్16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ ఉపగ్రహం 35 నుంచి 40 రోజుల్లో తన పని ప్రారంభిస్తుందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల ప్రత్యేక అధ్యయనం, వాతావరణంలోని మార్పులు, వ్యవసాయ రంగంపై సాంకేతికపరమైన సూచనలు వంటి అంశాలపై నిర్దిష్ట సమాచారం ఈ ఉపగ్రహం అందిస్తుందని తెలిపారు. రాకెట్లో అమర్చిన ఎల్ బ్యాండ్, ఎస్ బ్యాండ్, డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అప్రచర్ రాడార్‌తో భూమిని పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు శాయశక్తులా పనిచేశారని చెప్పారు. నిసార్ ఉపగ్రహం ఏడేళ్ల పాటు సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ ఏడాదిలో మొత్తం 13 ప్రయోగాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఫాల్కన్ రాకెట్‌లో శుభాంసు శుక్లాను పంపడం వలన అతని అనుభవాలను గగన్‌యాన్ ప్రోగ్రాంలో వినియోగించుకుంటామని నారాయణన్ చెప్పారు. గగన్‌యాన్ ప్రయోగంలో మూడు అన్‌క్రూడ్ మిషన్లు ప్రయోగించిన తర్వాత 2027లో క్రూడ్ మిషన్ ద్వారా మానవుని అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సంవత్సరం ఐదు ప్రైవేటు లాంఛర్లు కూడా ఉంటాయని చెప్పారు. చంద్రయాన్-4 ముఖ్యమైన ప్రయోగమని, దీని ద్వారా చంద్రునిపై మట్టి నమూనా తీసుకుని తిరిగి భూమికి వచ్చే విధంగా ప్రయోగాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ఇస్రో ఆధ్వర్యంలో మరిన్ని ప్రయోగాలు చేసేందుకు ఉత్సాహాన్ని ఇచ్చిందని నారాయణన్ చెప్పారు. ఈ సమావేశంలో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు నాసా శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# ఇళ్ళ నిర్మాణాల్లో పక్కాగా పురోగతి

### - కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



చిత్తూరు, జులై 30 ప్రభాతవార్త: ఇళ్ళ నిర్మాణాల్లో పక్కాగా పురోగతి సాధించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పూతలపట్టు, జిడినెల్లూరు, చిత్తూరు అర్బన్ నియోజకవర్గాల ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పనులపై హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఇన్‌ఛార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్రమణ్యం, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నిరుపేదలకు ఇళ్ళ నిర్మాణాల కోసం ప్రణాళికల్లో పేర్కొన్న లక్ష్యాలను సాధించడంలో అధికారులు నిబద్ధతతో కృషి చేయాలన్నారు. నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయిలో డిఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు క్రమం తప్పకుండా స్థల సందర్శనలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను వేగవతం చేయడానికి అదనపు ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 73,098 ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 52,880 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని, 22,756 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాల్సి వుందన్నారు. అధికారులు ఇళ్ళ లబ్దిదారులతో చర్చించి వారి ఇళ్ళ నిర్మాణాల్లో పూర్తి చేయడంలో ఎదైనా సందేహాలు వుంటే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్న నివాస ప్రాంతాల్లో మౌళిక సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఇతర విభాగాల్లోని వారి సహచరులతో కలిసి విధులు నిర్వర్తించాలన్నారు.

## జీవశాస్త్రంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉంది

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త



భవిష్యత్ తరాలకు జీవశాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు అధ్యాపకులు, మేధావులు చొరవ చూపాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు సూచించారు. బుధవారం ఎస్వీయూ స్టూడెంట్స్ వెల్ఫేర్, సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో జీవశాస్త్రం, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆధునిక కాలంలో భౌతిక, రసాయన శాస్త్రాల వంటి మూల శాస్త్రాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ మలేషియాకు చెందిన సీనియర్ అధ్యాపకులు డాక్టర్ మన్సూర్ ఇస్మాయిల్ షేక్, ఎస్వీయూ అధ్యాపకులు బీవీ మురళీధర్, డాక్టర్ ఎం వాణి, నిర్వాహకులు డాక్టర్ పత్తిపాటి వివేక్, సభ్యులు డాక్టర్ మోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నిరక్ష్యరాశ్యులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దటమే

# 'ఉల్లాస్ అక్షరాంధ్ర"

### -డిఆర్డిడిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు

తిరుపతిరూరల్, జూలై 30 ప్రభాతవార్త:




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉల్లాస్ అక్షరాంధ్ర' అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఆర్‌డిఎ ఏపిడి శోభన్ బాబు తెలిపారు. నిరక్షరాస్యులైన వయోజనులందర్ని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షరాంధ్రం లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఓ సమావేశ మందిరములో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అక్షరాంధ్ర శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శోభన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయశాఖ ద్వారా 2023 సంవత్సరంలో నిర్వహించిన సర్వే ద్వారా జిల్లాలో వయోజనులైన నిరక్షరాశ్యులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. తిరుపతి జిల్లాలో అక్షరాంధ్ర మొదటి విడతగా ఈ ఎడాది 88.687 మంది వయోజనులైన నిరక్షరాశ్యులను తీసుకుని, అక్షరాశ్యులుగా తీర్చిదిద్దటానికి సంబంధిత శాఖలైన డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా ద్వారా కార్యచరణ ప్రణాళిక రుపొందించాలన్నారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహమ్మద్ అజాద్ మాట్లాడుతూ జిల్లాకు ఇచ్చి టార్గేట్‌లో 67170మందిని డిఆర్డిఎకి, 7280మందిని డ్వామాకు, 14237మంది మెప్మాకు కేటాయించినట్లు తెలిపారు. పదిమంది నిరక్షరాశ్యులను ఒక వాలంటీర్ చొప్పున చదువు చెప్పాలన్నారు. అభ్యాసకులు గ్రామాల్లో లేదా వారి అవాస ప్రాంతాలకు దగ్గరగా ఉన్న అంగన్‌వాడి కేంద్రాల్లో లేదా పాఠశాలలో సాయంత్రం 5గంటల నుండి 7గంటల వరకు అక్షర తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నోడల్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంవిజయవంతం కావటానికి అన్నిశాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాశ్యులకు పంక్షనల్ డిజిటల్, ఫైనాన్సియల్ లెటరసిలో ప్రత్యేకమైనటువంటి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపిడిఓ రామచంద్ర మాట్లాడుతూ ఎపిఎంలు, ఏపివోలు, సిఎంఎంలు కీలకమైన పాత్ర పోషించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంలు, ఏపివోలు, సిఎంఎంలు, వయోజన విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోటలో బాలికలను కొట్టిన ఘటనపై మంత్రి లోకేష్‌కు నివేదిక అందజేస్తా

కోట, జులై 30 ప్రభాతవార్త



విచారణ జరుపుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ పూర్ణిమ

కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్సీ వసతి గృహం విద్యార్థినులను యూనిఫారం ధరించలేదని పిఇటి మాబాషా గుంజీలు తీయించడమే కాకుండా బెత్తంతో కొట్టిన సంఘటనపై విచారణ నివేదికను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ పూరిమిట్ల పూర్ణిమ తెలిపారు. బుధవారం కోటలోని ఎస్సీ వసతిగృహంలో ఆమె ఈ నెల 26న జరిగిన సంఘటనపై ఒక్కో విద్యార్థినిని పిలిచి విచారించారు. విద్యార్థినులు తాము యూనిఫాం ధరించని కారణంగా పిఇటి మాబాషా తమను గుంజీలు తీయించి బెత్తంతో కొట్టారని వివరించారు. కాళ్ల నొప్పులతో సాయంత్రం వచ్చి మేట్రిన్‌కి చెప్పామన్నారు. ఆమె తమను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారని తెలిపారు. అనంతరం మేట్రిన్ ఉషారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విచారణలో పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణ్‌రెడ్డి, అసెంబ్లీ కమిటీ సభ్యురాలు పోలమ్మ, పార్లమెంటు కార్యదర్శి భారతి తదితరులు ఉన్నారు.

# పేరుకు పేదలు: మట్టిలో మాణిక్యాలు

### ఎగువ,దిగువ సాంబయ్యపాళెం



మట్టిని కరగబెట్టె దృశ్యం

**శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న తొట్టంబేడు మండలంలోని ఎగువ,దిగువ సాంబయ్యపాళెం గ్రామాలున్నాయి.ఈ గ్రామంలో ప్రజలు ఏడాదిలో సగం రోజులు దేశంలోని ప్రధాన నగరాల్లో సంచరిస్తుంటారు. అక్కడ బంగారు,వజ్రాల పరిశ్రమల వద్ద మట్టిని సేకరించుకుంటారు. దానిని మూటలు కట్టి తమ స్వగ్రామాలకు చేరుతారు.ఇక్కడ ఆ మట్టి నుంచి బంగారాన్ని శోధిస్తారు.వజ్రాలను సాధిస్తారు. ఈ గ్రామాలకు చెందిన ప్రజలు చూడటానికి కడుబీద వారుగా కనబడతారు.కానీ వారి రూపం చూసిన వారు కడుపేదవారని భావిస్తారు.కానీ వారిలో కొందరు లక్షాధికారులు కాగామరి కొందరు కోటీశ్వరులు.వారికి సంబంధించిన ప్రత్యేక కథనం)**

తొట్టంబేడు జూలై 30 ప్రభాతవార్త

మట్టిలో ఉన్న బంగారాన్ని వెలికి తీయడమే ఆ గ్రామాల వృత్తి. ఇక్కడి ప్రజలకు వ్యవసాయం ఉంది. కానీ వారు మట్టినే నమ్ముకున్నారు. ఏడాదిలో సగం భాగం దేశంలోని ప్రధాన నగరాల్లోని బంగారు, వజ్రాల పరిశ్రమల వద్ద మట్టిని సేకరిస్తారు. ఈ మట్టిని ఎవరు ఎందుకు అమ్ముతారు ఎందుకు కొంటారో ఆ మట్టిని ఎవరు బంగారంగా మారుస్తారు. వారే ఎగువ, దిగువ సాంబయ్యపాళెంకు చెందిన వందలాది కుటుంబాలు. ఈ గ్రామస్తులు మట్టి వ్యాపారం తరతరాలుగా వీరికి జీవనోపాధి. లాభం వచ్చిన నష్టం వచ్చిన ఈ వృత్తి తప్ప మరేది లేదు. మట్టిలో బంగారం తీస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇది ఎక్కడో కాదు కాళహస్తి పట్టణానికి సుమారు 3 కిలో మీటర్ల దూరంలోనే ఉంది. ఆ గ్రామాలే ఎగువ, దిగువ సాంబయ్యపాళెంలు అక్కడ మరోక గ్రామం ఉంది అదే కళ్ళపూడి. ఈ మూడు గ్రామాలకు ఇదే జీవనధారం. ఈ గ్రామాల్లో సుమారు 700 మంది ఉంటే వారికి సగం మంది ఇదే జీవనాధారం. వీరు పెద్ద పట్టణాలోని పెద్ద బంగారు దుకాణాల వద్ద వెళ్ళి బంగారు పనులు చేసే వారి దగ్గర బంగారు మట్టిని కలెక్ట్ చేసుకుంటారు. ఇందులో ఐరన్, మెటల్స్ అయస్కాంతం ద్వారా వేరు చేస్తారు. బంగారు బయటకు తేవాలంటే వేస్ట్ మొత్తం వేరు చేయాలి. ఇందులో సిల్వర్, రాగి, బంగారం చేరిపోయి ఉంటాయి. దాని ప్రాసెస్‌ను ప్రత్యేకంగా చేస్తారు. ముందుగా ఆ మట్టిని నీటిలో కడుగుతారు. తరువాత దానిని అరచేతిలో పట్టేల ముద్దగా చేస్తారు. దానిని చిన్నచిన్న ముద్దలుగా చేసి ఆ ముద్దలను పీడకల పై పేర్చి దాని పై గడ్డి వేసి మంట పెట్టి వేడి చేస్తారు. మంటలో బాగా కలిసిన మట్టి పూర్తిగా ఆరిన తరువాత పిండి మిషన్ ద్వారా పొడి చేస్తారు. ఆ మొత్తం పొడిగా మారిన మట్టి పొడిని చెక్కదొన్నెలో వేస్తారు. ఉప్పు, పాదరాసాన్ని తగిన మోతాదులో వేసి బాగా కలపడం మొదలుపెడతారు. మెల్లగా మట్టిని రుద్దడం వలన మట్టిలోని బంగారం పాదారసంలో కలిసిపోతుంది. తరువాత నీరు పోసి మట్టిలోనుంచి పాదారసం వేరు చేస్తారు. పాదారాసాన్ని పోడిగడిలో వేసి పెడతారు. నెమ్మదిగా బంగారం పాదారాసం వేరై ఇతర లోహాలతో కూడిన బంగారం బయటకు వస్తుంది. వ్యర్ధాలతో కూడిన బంగారాన్ని మట్టి దగ్గరకు తీసుకెళ్ళి సంచిలో వేసి వంద డిగ్రీల వద్ద వేడి చేస్తారు. దానిని యాసిడ్ పోసి మళ్ళీ మరగబెడతారు. అందులో ఉన్న ఇతర లోహాలు యాసిడ్‌లో కరిగి పోవడంతో బంగారం మాత్రమే మిగులుతుంది. యాసిడ్, బంగారం మరో పాత్రలో పోసి మళ్ళీ వేరు చేస్తారు. అయితే ఒక్కొక్కసారి ఈ మట్టిలో బంగారం దొరక్కదని అలాంటప్పుడు మట్టి రవాణా చార్జిలు ఇతర ఖర్చులు వృధా అవుతున్నాయని ఇక్కడ పనిచేసేవారు వాపోతున్నారు. ఇక్కడ పనిచేసే వారే కాకుండా ఇతర ఊర్ల నుంచి పనికోసం మహిళలు వస్తున్నారని వారికి రోజు కూలి కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని అక్కడ పనిచేసే వారు వాపోతున్నారు.



.మట్టి నుంచి ధాతువులను వేరు చేస్తున్న దృశ్యం.

## ఐఓసిలో బాంబు బెదిరింపు కాల్‌పై మాక్ డ్రిల్

చిత్తూరు, జులై 30 ప్రభాతవార్త:



యాదమరిలోని ఇండియల్ ఆయిల్ కార్పొరేషన్‌లో బాంబు బెదిరింపు కాల్‌పై బుధవారం ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లో ఎప్పుడైనా ఎవరైనా బాంబు బెదిరింపు కాల్ చేస్తే ఎలా స్పందించాలి అనే విషయంపై ఏఆర్ ఎఎస్పీ శివానందకిషోర్ పోలీసు బాంబు స్క్వాడ్ సిబ్బందితో మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ మాక్ డ్రిల్ అనంతరం ఏఆర్ ఎఎస్పీ శివానంద కిషోర్ మాట్లాడుతూ ప్రతి బాంబు బెదిరింపు కాల్‌ను నిజమైనదిగా భావించి స్పందించాలన్నారు. ప్రాణాలకు ముప్పు కలిగే పరిస్థితి వచ్చినా, సమర్థవంతంగా, శాస్త్రీయంగా స్పందించే విధంగా అన్ని శాఖల మధ్య స మన్వయం వుండాలన్నారు. ఈ తరహా డ్రిల్లులతో పోలీసు సిబ్బంది స్పందన వేగంను పరీక్షించడం, పరిష్కార సామర్థ్యంను మెరుగుపరచడం, స్థానిక భద్రతా సిబ్బందికి అవగాహన కల్పించడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. అలాగే ఐఓసిఎల్ వంటి కీలక స్థలాల్లో ఎప్పటికప్పుడు భద్రతా వ్యవస్థను పునఃపరిశీలిస్తూ అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఇలాంటి డ్రిల్స్‌తో పోలీసు సిబ్బందికి కాకుండా ఆ శాఖలతో కలసి పనిచేసే ఇతర భద్రతా సిబ్బందికి సమర్థవంతమైన అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, యాదమరి ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్, తహసిల్దారు పార్థసారధి, ఐఓసిఎల్ చీఫ్ టర్మినల్ మేనేజర్ ప్రసాద్‌రావు, బిడి టీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు అరగొండ సింగిల్ విండో అధ్యక్షుని ప్రమాణ స్వీకారం

తవణంపల్లె, జూలై 30 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ సింగల్ విండో అధ్యక్షుని ప్రమాణ స్వీకారం కార్యమ్రం గురువారం ఉదయం జరుగుతుందని సింగిల విండో అధికారులు తెలిపారు. అరగొండ సింగిల్ విండో అధ్యక్షునిగా ఎ.రంజిత్‌రెడ్డిని నియమిస్తూ ఇటీవల ప్రభుత్వ ఉత్వర్వులు జారీ చేసిన విషయం విధితమే.ఈమేరకు అధ్యక్షుడు రంజిత్‌రెడ్డితో పాటు డైరక్టర్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్‌లు గురువారం ఉదయం 10 గంటలకు సింగిల్ విండో కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

## పేదలకు కడుపునిండా అన్నంపెట్టేందుకే అన్న క్యాంటీన్లు

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్
– గుడుపల్లెలో అన్న క్యాంటీన్ నిర్మాణంకు భూమిపూజ !!



కుప్పం(గుడుపల్లె), జూలై 30 ప్రభాతవార్త

పేదలకు కడుపునిండా అన్నంపెట్టేందుకు సిఎం చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను మంజూరు చేశారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం గుడుపల్లెలో 66లక్షల వ్యయంతో నూతనంగా అన్న క్యాంటీన్ భవన నిర్మాణంకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు కుప్పంలోని నాలుగు మండలాల్లో కూడా అన్న క్యాంటీన్లకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. త్వరలోనే మల్లానూరు, రామకుప్పం, శాంతిపురం మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కేవలం 5రూ.లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ నాటికల్లా గుడుపల్లెలో అన్నకా ్యంటీన్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేటప్పనాయుడు, మాజీ ఎంపిపి జిఎం రాజు, మాజీ అధ్యక్షుడు హేమాంబర గౌడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్బు, జనసేన అమీర్‌తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం

కుప్పం, జూలై 30 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో బుధవారం 11వ క్లస్టర్ ఇన్‌చార్జ్ కె.కన్నన్ అధ్వర్యంలో తెదేపా నేతలు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మోడల్ కాలనీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈసందర్బంగా కన్నన్ మాట్లాడుతూ పచ్చని మొక్కలు నాటడంతో పాటు వాటిని స ంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, నేతలు నబీఉల్లా, అల్లాబకష్, గనిఉల్లా, నాగభూషణం, షహనాజ్ బేగం, ఫరూక్, అస్లం, సమీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టల్‌లో ఎంపిడిఒ తనిఖీ

శాంతిపురం, జూలై 30 ప్రభాతవార్త



మండలంలోని దండికుప్పం ప్రభుత్వ హాస్టల్‌లో బుధవారం ఎంపిడిఒ పిఆర్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో జరుగుతున్న మరమ్మత్తు పనులు పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహారం, నీటిని పరిశీలించి స ంతృప్తి వ్యక్తం చేశారు. కాగా హాస్టల్ ఉన్న 60మందికి దుప్పట్లు అవసర మని, అలాగే బోరు మరమ్మత్తులు చేయించాలని వార్డెన్ సుధాకర్ కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రవినాయక్ పాల్గొన్నారు.

## అభివృద్ధి అజెండాగా సిఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన

శాంతిపురం, జూలై 30 ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్దే అజెండాగా సిఎం చంద్రబాబునాయుడు సింగపూర్ దేశంలో పర్యటించారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్టానికి పెట్టుబడులతో పాటు విదేశాల్లో పడిపోయిన ఎపి బ్రాండ్‌ను తిరిగి పునరుద్ధరించే దిశగా సిఎం చంద్రబాబు పర్యటన జరిగిందన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో సుస్థిర పాలన, పారదర్శక విధానాలు, పాలసీలు, సమర్థనాయకత్వం చూసి సింగపూర్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తామని స్పష్టం చేసిందన్నారు. జగన్ బ్రాండ్ డిస్ట్రక్షన్ అయితే సిఎం చంద్రబాబు బ్రాండ్ కన్‌స్ట్రక్షన్ అని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థ లులూ గ్రూప్‌కు భూములు కేటాయించడం నేరమా అని ప్రశ్నించారు. 2014–19 మధ్య లులూ గ్రూప్‌కు వైజాగ్‌లో భూములు కేటాయిస్తే వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

## పెద్దవంకలో శ్రీ కనకనాంచారమ్మ ఉత్సవాలు

కుప్పంరూరల్, జూలై 30 ప్రభాతవార్త

మండలంలోని నాయనూరు పంచాయతీ పెద్దవంక గ్రామం వద్ద వెలైసిన శ్రీ కనకనాంచారమ్మ ఆడి 18 ఉత్స వాలు ఆగస్టు 3వతేది నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం అమ్మవారికి విశేష పూజలు, భక్తుల కావడి చెల్లింపులు, దెయ్యాలు తోలడం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## స్వామిత్వ సర్వేపై శిక్షణాతరగతులు

పెద్దపంజాణి జూలై30 ప్రభాతవార్త:



మండలంలోని 15రెవిన్యూ గ్రామాల్లో స్వామిత్వ సర్వేచేసే అంశంగా సచివాలయ సిబ్బందికి,పంచాయతీ కార్యదర్శి,సర్వేయర్,విర్వోలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా గ్రామ కంఠం భూముల గుర్తింపు ఇళ్ళస్థలాల వివరాలు తదితరాల గురించి సర్వేయర్ లోకేష్ వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప,డిప్యూటి ఎంపిడిఒ శారదదేవి తదితరులు పాల్గొన్నారు.

## స్కూళ్ళకు స్మార్ట్‌ఫోన్లు సరఫరా

– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరు, జూలై 30 ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ ఫోన్లు సరఫరా చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో పాఠశాలల్లో యాప్‌ల వినియోగం ఎక్కువ అయ్యిందని, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం మొబైల్ ఫోన్లు వాడుతున్నారన్నారు. ఈ మొబైల్ ఫోన్లలో పాఠశాల సమాచారం కోసం అదనంగా యాప్‌లు వుంచడంతో ఫోన్లకు తగు సామర్థ్యం లేకపోవడంతో ఫోన్లు జామ్ అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ఈ కారణంతో ఉపాధ్యాయుల వ్యక్తిగత డేటా సైతం చోరీకి గురి అయ్యే అవకాశం వుందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సత్వరం స్పందించి ఆధునాతన కంప్యూటింగ్ శక్తి గల ఉన్నత శ్రేణి స్మార్ట్ ఫోన్లు, బయోమెట్రిక్ పరికరాలు ప్రత్యేకంగా పాఠశాలల వినియోగం కోసం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## వైకాపా బలోపేతానికి చర్యలు - ఎంపిపి యువరాజ్

వి.కోట, జూలై 30 ప్రభాతవార్త



మండలంలో వైకాపా బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిపి యువరాజ్ పేర్కొన్నారు. బుధవారం పాముగానిపల్లి, ముదరందొడ్డి, బైరుపల్లి పంచాయతీల్లో ఆయన నేతలు, కార్యకర్తలతో సమావేశమై గ్రామ కమిటీలను నూతనంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వైకాపా పాలనలో కులమతాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ అందించారన్నారు. పలమనేరులో సైతం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అలాగే పనిచేశారన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు మండలంలో పార్టీ బలోపేతంకు సహకరించాలని కోరారు. సమావేశంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర బ్రాహ్మణ సంఘటన కోఆర్డినేటర్‌గా టీవీఎస్ బాబు

పుంగనూరు, జూలై 30, ప్రభాతవార్త



పట్టణానికి చెందిన ఎస్.ఆర్. వేంకట ప్రసాద్ శర్మ (టీవీఎస్ బాబు) రాష్ట్ర బ్రాహ్మణ సంఘటన సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. 2027 వరకు ఆయన ఈ పదవిలో సేవలు అందించనున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య ఈ నియామకాన్ని ప్రకటించారు. బ్రాహ్మణ సమాజాభివృద్ధిలో శర్మ సేవలు, సమాజం పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్టు తెలిపారు. నియామక పత్రం అందుకున్న వెంకట ప్రసాద్ కు పుంగనూరు బ్రాహ్మణ సంఘాలు శర్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సంస్కరణలను బ్రాహ్మణ కుటుంబాల సైతం ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యచరణ రూపొందిస్తామని వివరించారు.

## పుంగనూరు అభివృద్ధి చేసి చూపిస్తాం

పుంగనూరు, జూలై 30, ప్రభాతవార్త



నియోజకవర్గంలో అభివృద్ధి పదేళ్లుగా ఆగిపోయిందని, కూటమి ప్రభుత్వం హయాంలో నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపిస్తామని పార్టీ ఇన్చార్జ్ చల్లా బాబు అన్నారు. బుధవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు ప్రారంభం సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో పుంగనూరు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులను జరగనివ్వకుండా ప్రారంభోత్స వాలు మాత్రమే చేసి హంగామా సృష్టించి పబ్బం గడుపుకున్న ఘనత గత ప్రభుత్వాని దన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక అరాచకాల్ని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వానికి మరో దశబ్దమైన కాలం సరిపోదని, అపరచానిక్యుడు రాజనీతి ప్రజ్ఞుడు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చాలా వరకు మెరుగుపడిందని, ప్రజలకు అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయని అన్నారు. రాబోయే మూడేళ్ల కాలంలో పుంగనూరు నియోజకవర్గంలో కోల్పోయిన అభివృద్ధితోపాటు రెట్టించిన ప్రగతిని సాధించేందుకు కార్యచరణ సిద్ధం చేశామని అందుకు ప్రభుత్వం కూడా అంగీకరించిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి, ప్రభుత్వం తోడుగా పుంగనూరు నియోజకవర్గంలో చేపట్టాల్సి న అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి కల్పన వంటి విషయాలను రుజువు చేస్తామన్నారు.

## కృష్ణాపురంలో జాతీయ డెంగ్యూ మాసోత్సవ ర్యాలీ

తవణంపల్లె, జూలై 30 ప్రభాతవార్త:



జాతీయ డెంగ్యూ మాసోత్స వంను పురస్కరించుకుని మండలంలోని కృష్ణాపురంలో మండల వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్త టి.సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంటువ్యాధుల కారక దోమలను అరికట్టాలని, ఇంటిపరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేయాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని నినాదాలు చేస్తూ గ్రామ పురవీదుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఆశా వర్కర్లు ద్రాక్షాయణి, రేణుకలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో విధిగా ట్రాఫిక్ నిబంధలను పాటించాలి

కాణిపాకం, జూలై 30 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యాలను దృష్టిలో వుంచుకుని విధిగా ట్రాఫిక్ నిబంధలను పాటించాలని స్థానిక ఎస్సై నరసింహులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తుల సౌకర్యాలను దృష్టిలో వుంచుకుని కాణిపాకం ఆటోస్టాండు నుండి అగరంపల్లె వరకు వన్ సైడ్ పార్కింగ్‌ను గురువారం నుండి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరక మధ్యాహ్నం వరకు ఒక వైపు, మధ్యాహ్నం నుండి రాత్రి వరకు మరో వైపు వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. అలాగే లాడ్జీలు, హోటళ్ళ ముందు కారు, బస్సు వంటి భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా లాడ్జీలు, హోటళ్ళ యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వాహనదారులకు కాకుండా లాడ్జీలు, హోటళ్ళ యజమానులకు జరిమానా విధిస్తామని ఎస్సై నరసింహులు హెచ్చరించారు.

## ఎంఈఓచే పొన్నేడుపల్లె పాఠశాల ఆకస్మిక తనిఖీ

తవణంపల్లె, జూలై 30 ప్రభాతవార్త:



మండలంలోని పొన్నేడుపల్లె మోడల్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ హేమలత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్బంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు.ఈమేరకు ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.పాఠశాల హెచ్ఎం మోహన్‌రెడ్డి, సీఆర్పీ చిట్టిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా నారసింహపల్లెలో సుపరిపాలనతో తొలి అడుగు

తవణంపల్లె, జూలై 30 ప్రభాతవార్త:



కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తెల్లగుండ్లపల్లె మోహన్‌నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్బంగా పార్టీ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి మండలంలోని నల్లిశెట్టిపల్లె గ్రామ పంచాయతీలో మండల టీడీపీ నాయకులు దాము యాదవ్ ఆధ్వర్యంలో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మోహన్‌నాయుడు మండల టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో అభివృద్ధి పథకాలను అమలు చేయడంతో పాటు రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఏకాంబరనాయుడు, రైస్‌మిల్ బాలాజి, చందు, డిల్లీబాబు, కమలాకర్, పరందామ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లకు అవకాశం

కుప్పం, జూలై 30 ప్రభాతవార్త



కుప్పం ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన డ్రైవర్లకు అవకాశం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ టికె స్వామి తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు చేయకుండా డిఎల్, హెవీ లైసెన్స్ కలిగిన వారు, పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆధార్ కార్డు కలిగి ఉండడంతో పాటు కుప్పం పరిసర ప్రాంతాల్లో ఉండే వారికి తగు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తగిన అర్హతలు ఉన్నవారు స్థానిక డిపో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నిత్యబాబు బాధ్యతల స్వీకరణ

చిత్తూరు, జులై 30 ప్రభాతవార్త:



చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నిత్యబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నిత్యబాబును ఎస్పీ మణికంఠ చందోలు చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం నిత్యబాబు చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణను ఎస్పీ మణికంఠ చందోలు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ చేశారు.

## మహిళా స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా లక్ష్మీనారాయణ

చిత్తూరు, జులై 30 ప్రభాతవార్త:



చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణను ఎస్పీ మణికంఠ చందోలు చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు లక్ష్మీనారాయణ బుధవారం మహిళా స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## ఎస్‌బి ఇన్స్‌పెక్టర్‌గా సూర్యనారాయణ

చిత్తూరు, జులై 30 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్‌గా సూర్యనారాయణ నియమితులయ్యారు. కల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు న్విహిస్తున్న సూర్యనారాయణను ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం చిత్తూరు ఎస్‌బి ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సూర్యనారాయణ ఎస్‌బి ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే చిత్తూరు విఆర్‌లో వున్న ఇన్స్‌పెక్టర్ జయరామయ్యను ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం కల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రభుత్వంపై బురద చల్లడానికే వైకాపా రీకాల్

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్.

చిత్తూరు, జులై 30 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వంపై బురద చల్లడానికే వైకాపా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో, క్యూఆర్ కోడ్ కార్యక్రమం అంటూ అసత్య ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీ సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరులో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ ఎంసి విజయానందరెడ్డి తన కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌రెడ్డి ఫోటోతో ఎమ్మెల్యే వారంటీ మోసం గ్యారంటీ కాప్షన్ పెట్టి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు ఉల్లంఘించే చరిత్ర సిఎం నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులకు లేదన్నారు. ఎమ్మెల్యే గురజాల గురించి చిత్తూరు ప్రజలందరికీ తెలుసునని, ప్రజలను నిత్యం అందుబాటులో వుండి సాధారణ వ్యక్తిగా ప్రజలతో కలిసిపోతూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. వైకాపా ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో చేయలేని పనులను కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలో చేపట్టి పూర్తి చేసిందన్నారు.

## దేశానికే స్ఫూర్తి చంద్రబాబు సంస్కరణలు

పుంగనూరు రూరల్, జూలై 30, ప్రభాతవార్త



పేదల సంక్షేమ దాతగా వినుతికెక్కిన దివంగత ఎన్టీఆర్ అడుగుజాడల్లో చంద్రబాబు చేపట్టిన సంస్కరణలు భారతదేశానికే స్ఫూర్తిగా నిలిచాయని నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వనమలదిన్నె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వందలాది మంది గజమాలతో అభిమానం చాటారు. టీడీపీ పాలనలో అమలైన అభివృద్ధి పనులు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు నేరుగా విన్న చల్లా, టీడీపీ పాలనలోనే ప్రజలకు నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పగడాల రమణ, జనసేన జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు చైతన్య రాయల్, సయ్యద్ సుహేల్ భాష, మోహన్ నాయుడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం

పుంగనూరు రూరల్, జూలై 30, ప్రభాతవార్త



పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్స వం బుధవారం నిర్వహించారు. ఈ సందర్బంగా పోలీసులు అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో న్యాయ, పోలీసు వ్యవస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఎస్ఐ వెంకటరమణ అన్నారు. చట్టపరమైన చర్యలతోపాటు, ప్రజల్లో చైతన్యం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సంస్థ అధ్యక్షురాలు శ్రావణి, సభ్యులు పాల్గొన్నారు.

## మణీంద్రం సెగ్మెంట్ ఎంపిటిసి అభ్యర్థిగా అరుణ

రామకుప్పం, జూలై 30 ప్రభాతవార్త



మండలంలోని మణీంద్రం ఎంపిటిసి సెగ్మెంట్‌కు అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అత్తికుప్పంకు చెందిన జ్ఞానశేఖర్‌రెడ్డి భార్య అరుణ పేరు ఖరారైనట్లు టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. గురు,లేదా శుక్రవారం ఆమె నామినేషన్లు దాఖలు చేస్తారన్నారు. కాగా ఎంపిటిసి ఎన్నికకు శుక్రవారంతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది.

## తెలంగాణామంత్రిని కలసిన రామకుప్పం నేతలు

రామకుప్పం, జూలై 30 ప్రభాతవార్త



తెలంగాణా రాష్ట్ర మంత్రి వాకాటి శ్రీహరి, కాంగ్రెస్ సీనియర్ నేత అజారుద్దీన్‌ను రామకుప్పంకు చెందిన తెదేపా నేతలు నందారెడ్డి, నియాజ్ కలిశారు. నందారెడ్డికి మంత్రి శ్రీహరితో స్నేహం ఉండడంతో ఆయన తన కుమారుడి పెళ్లికి మంత్రిని ఆహ్వానిస్తూ పత్రికను మహబూబ్ నగర్‌లో అందజేశారు.

## ఏడు లక్షలతో చెరువు కాలువల పనులు

రామకుప్పం, జూలై 30 ప్రభాతవార్త



స్థానిక కనమనాయనపల్లి పెద్ద చెరువు కాలువ పనులను కూటమి నేతలు భూమిపూజ చేసి ప్రారంభించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఏడు లక్షల రూపాయలతో ఈపనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు ఆంజనేయరెడ్డి, సీతాపతి, పద్మనాభరెడ్డి, రామకృష్ణప్ప, రవిరెడ్డి, సలాంసాబ్, బాలరాజు, సుబ్రి, ఆదిల్, కేశవరెడ్డి, మంజునాథ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

## గోనమాకులపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

వి.కోట, జూలై 30 ప్రభాతవార్త

మండలంలోని గోనమాకులపల్లిలో బుధవారం తహాశీల్దార్ ఉదయ్ సంతోష్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్స వం నిర్వహించారు. ఈసందర్భంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారంకే ప్రతి నెలా పౌర హక్కుల దినోత్స వం జరుపుతున్నట్లు తెలిపారు. ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారంకు తగు చర ్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఈశ్వరన్, వివిధ శాఖల అధికారులు, దళిత నేతలు పాల్గొన్నారు.

## వసతిగృహాల్లో సమస్యలపై పోరుబాట : కళ్యాణ్‌భరత్

చౌడేపల్లి, జూలై 30 ప్రభాతవార్త



వసతిగృహాల్లో సమస్యలపై పోరుబాట చేపడుతున్నట్లు రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ అన్నారు. మాజీ ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ ఒడ్డిల ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్సీ బాలురు, బాలికలు, బిసి బాలుర వసతి గృహాల్లో వసతులను పర్యవేక్షించారు. వసతిగృహాల్లో మౌళిక వసతులు, మరుగుదొడ్లు, భోజన వసతిలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ పెద్దలకు తెలిపి పరిష్కారం దిశగా చర్యలు తీసుకొంటామన్నారు. వైకాపా నాయకులు గ్రెంథెం మంజునాథ్, గోపీనాథ్, జిల్లా సోషియల్ మీడియా కార్యదర్శి నాగేంద్ర, విద్యార్థి నాయకులు మల్లికార్జున, గోవర్ధన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## కమిటీల పనితీరుతో పార్టీ లక్ష్యాలను అధిగమించాలి : వైకాపా

చౌడేపల్లి, జూలై 30 ప్రభాతవార్త



కమిటీలు మంచి పనితీరును ప్రదర్శించి పార్టీ లక్ష్యాలను అధిగమించాలని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు నడింపల్లి దామోధర్‌రాజు, మండలాధ్య క్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఎ.కొత్తకోట, చారాల, దుర్గసముద్రం, శెట్టిపేట పంచాయతీల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీతోపాటు పంచాయతీల గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేసారు. రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు కమిటీలు నియమిస్తున్నామనీ, ఆయా కమిటీల ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారిలో చైతన్యాన్ని తేవాలని నూతన కమిటీలకు దిశానిర్దేశం చేసారు. నాయకులు రామ్‌నారాయణరెడ్డి, షఫీ, రమణ, సినిమారాజారెడ్డి, పల్ల వెంకట్రెడ్డి, మిద్దింటి శంకరనారాయణ, రుక్మిణమ్మ, సుధాకర్‌రెడ్డి, రవి, ఆనందాచార్యులు, రవిచంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్లూరు సిఐగా జయరామయ్య బాధ్యత స్వీకరణ

కల్లూరు, జూలై 30, ప్రభాతవార్త

కల్లూరు సిఐగా జయరామయ్యను బుధవారం నియమించారు. ఇక్కడ ఉన్న సిఐ సూర్య నారాయణ చిత్తూరు ఎస్బీకి బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న జయరామయ్యను కల్లూరు సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఇబ్బంది కలుగకుండా కృషి చేస్తానని సిఐ జయరామయ్య అన్నారు.



## మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడి మృతి

చౌడేపల్లి, జూలై 30 ప్రభాతవార్త

జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడు టి.శివకుమార్(35) మృతి చెందాడు. గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన 3నెలలుగా వ్యాధి తీవ్రత అధికం కావడంతో ఆయన నివాసం పెద్దయల్ల కుంట్లలో మృతి చెందాడు. మాలల హక్కుల సాధన కోసం, అన్యాయాన్ని ఎదిరించే ఉద్యమకారుడుగా శివ కుమార్ జిల్లా వాసులకు సుపరిచితుడు ఆయన మరణ వార్త వినగానే దిగ్భ్రాంతికి గురయ్యారు. మాలమ హానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం, డివిజన్ కార్యదర్శి మల్లెల మోహన్, జిల్లా నాయకులు గుండా మనోహర్, బ్యాంకు రెడ్డెప్ప, యమలా చంద్రన్న, శేఖర్, కూరపర్తి అంజిబాబు, పారిశ్రామిక, రాజకీయ, మేధావి వర్గాలకు చెందిన వారందరూశివకుమార్‌మృతదేహాన్ని సందర్శించి, మృతుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

## ప్రభుత్వపాఠశాల స్థలం ఆక్రమణ..న్యాయంచేయాలని అధికారులకు బాధితులు ఫిర్యాదు.



*పెద్దపంజాణి జూలై 30 ప్రభాతవార్త:* మండల కేంద్రమైన పెద్దపంజాణిలో ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన స్థలాన్ని ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించి అందులో రియల్‌ఎస్టేట్ వ్యాపారంచేసి తమకు సైట్లు విక్రయించాడని తమకు న్యాయం చేయాలని బాధితులు బుధవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా.. పెద్దపంజాణిలోని హైస్కూల్‌కు సుమారు 30ఏళ్ళక్రితం గ్రామస్థులంతా కలసి 5ఎకరాల భూమిని కొనుగోలుచేసి 1993లో అప్పటి జిల్లాకలెక్టర్,డిఈఓల పేర్లమీద రిజిస్ట్రేషన్ చేయించారు.అయితే ఈ స్థలం తనకే చెందిందంటూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు రెవిన్యూరికార్డులు సృష్టించుకొని అక్రమంగా లేవుట్లు వేయించి ఇళ్ళస్థలాలు విక్రయించినట్లు వారు పేర్కొన్నారు.దీంతో తాము సర్వే చేయించగా పాఠశాల స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించినట్లు గ్రామస్థులు తెలిపారు.ఈ విషయంగా ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తమకు అక్రమంగా భూములు విక్రయించారని ప్లాట్లుకొన్న బాధితులు ఫిర్యాదు చేశారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన

శ్రీకాళహస్తి జూలై 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఎంఎజిఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని తెలుగుగంగకాలనీలో సరస్వతిమున్సిపల్ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం పై తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఎంజిఎం సంస్థల అధినేత గుడ్లూరు.మయూర్ తెలిపారు.ఈ సందర్భంగా 8,9,10 వ తరగతి విద్యార్థులకు స్త్రీ సంబంధిత డాక్టర్.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ యుక్త వయస్సు లో వచ్చే రుతుసంబంధిత సమస్యలపై అవగాహన కల్గించారన్నారు.గుండె సంబంధిత డాక్టర్ వివేక్‌చైతన్య ఎవరికైనా హార్ట్‌ఎటాక్ వచ్చినప్పుడు వారికి రెండు చేతులతో సిపిఆర్ ఎలా చేయాలో అనే అంశం గురించి వివరించారు.చిన్నపిల్లల వైద్యనిపుణులు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ పుట్టిన శిశువుల ఇన్‌ఫెక్షన్స్ తొందరగా సోకుతాయని వాటిని ఎలా నివారించుకోవాలనే అనే విషయం పై అవగాహన కల్పించారు.పంటి సంబంధిత వైద్యులు డాక్టర్ అర్చన మాట్లాడుతూ మనం నిత్యం అనుసరించే మన జీవనశైలి విధానాన్ని మార్చుకోవాలని ముఖ్యంగా తీపి పదార్థాలకు దూరంగా ఉండాలని ఉదయం,రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగ్గా బ్రష్ చేసుకోవాలని దాన్ని దంతక్షయం నివారించవచ్చున్నారు.పాఠాశాల ప్రధానోపాధ్యాయురాలు బృందదేవి మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం పై అవగాహన సదస్సులను ఏర్పాటు చేసిన గుడ్లూరు మయూర్‌కి ధన్యావాదాలు తెలిపారు.

# మాజీ ఎంఎల్‌ఏను పరామర్శించిన వైకాపా నాయకులు

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు తాటిపర్తి చెంచురెడ్డి అనారోగ్యంతో తిరుపతిలోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వైకాపా నాయకులు ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి డాక్టర్లను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా కుటుంబసభ్యులను కలసి ధైర్యం చెప్పారు.ఈ మేరకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఉత్తరాది శరవణ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆలయాలు శాంతికి నిలయాలు

తొట్టంబేడు జూలై 30 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయితీ మల్లి గుంట గ్రామంలో అంగరంగ వైభవంగావినాయక విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఉమ్మడిజిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి ఉన్నం.వాసుదేవనాయుడు హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మనకు శాంతి సౌఖ్యాలు అందించే ఆలయాలను నిర్మించుకోవాలని పిలుపు నిచ్చారు. ఏ గ్రామంలో దేవాలయం ఉంటుందో ఆ గ్రామంలో పెద్దలు,పిన్నలు ఏదో ఒక వేళలో దర్శించుకుంటారు. దేవుడంటే భక్తి,భయం ఏర్పడుతుందన్నారు. మంచిపనులు చేయటానికి అవకాశం ఉంటుందని వాసునాయుడు అన్నారు. మల్లిగుంటలో గ్రామస్తులు చొరవ చూపి వినాయక ఆలయం నిర్మించుకోవటం నేడు కుంబాభిషేకం జరుపుకోవటం వారిలోని ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం అన్నారు.ఈ సందర్భంగాఆయనకు గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల పార్టీ వైకాపా అధ్యక్షులు కోగిల.సుబ్రమణ్యం,మండల నాయకులు పెరుమాళ్‌రెడ్డి మహిళలు పాల్గొన్నారు

# ప్రగతి సంస్థ అధ్వర్యంలో మానవ అక్రమ రవాణా దినోత్సవా కార్యక్రమం

శ్రీకాళహస్తి రూరల్ జూలై 30 ప్రభాతవార్త

ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు ఉన్నత పాఠశాలలో బుధవారం మానవ ఆక్రమ రవాణా దినోత్సవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ శిరిషా మాట్లాడుతూ పాఠశాలల వచ్చే సమయంలో విద్యార్థిని విద్యార్థులు జాగ్రత్త వహించాలని ఏవరైనా సమస్య సృష్టితే టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేయాలన్నారు.ట్రైనీ ఎస్‌ఐలు మాట్లాడుతూ హ్యూమన్ ట్రాఫిక్ అనేది జరగడం వలన రకారకాల పనులు చేయుటకు అవయవాల దొపిడి జరగొచ్చునని జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిఉపాధ్యాయులు,ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజూష ప్రగతి కో ఆర్డినేటర్లు వెంకటేష్,మురగయ్యలు పాల్గొన్నారు.

# అంధకారంలో జగనన్న కాలనీవాసులు

శ్రీకాళహస్తి రూరల్ జూలై 30 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం వికృతమాల పంచాయితీ పరిధిలో ఉన్న జగనన్నకాలనీలు అంధకారంలో మగ్గుతున్నా యని దీనిని పట్టించుకునే నాధుడే కరువైయ్యారని సిపిఐ ఏర్పేడు మండల కార్యదర్శి సర్దార్‌శివ బుధ వారం ధ్వమెత్తారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళపాలనలో వైకాపా ప్రభుత్వం పేదలందరికి ఇల్లుఫధకం అమలు చేసిందని ఆ మేరకు వికృతమాల,మర్రిమంద పంచాయితీలో 900 మందికి ఇళ్ళస్దలాలను పంపిణి చేశారు.అయితే ఇక్కడ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి సరైన సదుపాయాలు భద్రత కరువైందని దీని పై జిల్లా కలెక్టర్,స్దానిక ఎంఎల్ఎ,పంచాయతీ అధికారులు స్పందించి సమస్యల పై దృష్టిసారించాలన్నారు.

# బాల్యవివాహాలపై అవగాహనా కార్యక్రమం

తొట్టంబేడు జూలై 30 ప్రభాతవార్త



తొట్టంబేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినివిద్యార్థులతో బాల్యవివాహాల నిర్మూలన పై మండల వైద్యధికారి డాక్టర్ లహరి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వైద్యధికారి డాక్టర్ లహరి మాట్లాడుతూ బాల్యవివాహాలు ఓ సాంఘిక దురాచా రమన్నారు.బాల్యవివాహాలు చట్టరీత్యానేరం అని,బాలికల విద్య,రక్షణ,ఆరోగ్యం అభివృద్ది ఇవి ఆటంకాలు సృష్టించడమే కాకుండా వారి కలలను సకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నా రు.బాల్యవివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైనంత వరకు ప్రయత్నాలు చేయాలన్నారు.సమాజంలో బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు.బాలల విద్య భద్రత కోసం ప్రతి ఒక్కరు తమ గళాన్ని వినిపించాలన్నారు.బాల్యవివాహ్ రహిత సమాజ సహాకారానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ లహరిని పిహెచ్‌ఎన్ సంపూర్ణ,నాగేంద్రహెల్త్‌సూపర్‌వైర్,ఎ.వేంకటేశ్వర్లు ఎంపిహెచ్ఎ,వరలక్ష్మి ఎఎన్ఎం,జడ్పిహైస్కూల్ ఇన్‌చార్జి టీచర్ కుమార్,సుగుణ,నిర్మల,పిఇటి, మెడికల్,పాఠశాల సిబ్బందిలు గ్రామ ప్రజలకు,విద్యార్దులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# మధ్యాహ్న భోజన పథకంపై నిర్లక్ష్యం వద్దు

శ్రీకాళహస్తి జూలై 30 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా అన్ని ప్రభుత్వ పాఠాశాలలో అమలు చేస్తున్న మద్యాహ్నాభోజన పధకం పై నిర్వహకులు పర్యవేక్షకులు నిర్లక్ష్యం వహించరాదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోయ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన జడ్పిబాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు.విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్నాభోజనాన్ని పరిశిలించారు.మెను ప్రకారం భోజనం సరఫరా చేయాల్సిందేనని స్పష్టం చేశారు.పోట్టు తీయకుండా ఉడకబెట్టిన గుడ్లను విద్యార్థినులకు అందజేయడం పట్ల నిర్వాహకుల పై మండిపడ్డారు.పోట్టు తీసుకుని తినే క్రమంలో 800 మంది విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిఎంను పర్యవేక్షిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మెను బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. జిల్లా నాయకులు రమణ,సిఐటియూ జిల్లా కార్యదర్శి గురవయ్య,గంధం మణిలు ఉన్నారు

# గ్రామీణాభివృద్ధి ఒక్క కూటమికే సాధ్యం

శ్రీకాళహస్తిరూరల్ జూలై 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గ్రామీణాభివృద్ధి ఒక్క కూటమికే సాధ్యం అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను మండల పార్టీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్ అధ్యక్షతన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. గ్రామ పొలిమేరల్లో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి ఏడాదిలో చేపట్టిన ప్రగతిని వివరించారు. అలాగే ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి రోజు రోజుకు అభివృద్ది చెందుతుందని పట్టణ వైశాల్యం అమ్మపాళెం వరకు పెరిగిందన్నారు. ఈ గ్రామం పేరుకే పంచాయతీ కానీ పట్టణ నడిబొడ్డులోనే ఉందన్నారు.ఈ గ్రామాలకు సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో మండల నాయకులు కామేష్‌యాదవ్, బత్తిరెడ్డి,జగదీశ్వరరెడ్డి, రాఘవులు రెడ్డి రామచంద్రయ్య పాల్గొన్నారు

# టెన్నిస్ బాల్ పోటీలలో లిటిల్ ఏంజెల్ స్కూల్ విద్యార్థులు ఘన విజయం

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాత వార్త




జిల్లా క్రికెట్ పోటీలు (టెన్నిస్ బాల్) తుమ్మల గుంట గ్రౌండ్ నందు అండర్ 14,17 బాలురు పోటీలు జరిగాయి.14 టీం లు పోటీలో హాజరు ఐయ్యారు.విజేతలు మొదటి స్థానం అండర్ 14 లిటిల్ ఏంజెల్స్ పాఠశాల,రెండవ స్థానం ఇంటర్ నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్.మూడవ స్థానం శోక్రాటీస్, నాగార్జున పబ్లిక్ స్కూల్స్ మిశ్రంగా గెలుపు అందుకున్నాయి.అండర్ 17 నందు మొదటి స్థానం ఇంటర్ నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్.రెండవ స్థానం రెయిన్బో స్కూల్ మూడవ స్థానం జి ఎస్ ఆర్ మాగ్నేటిక్ ,లిటిల్ ఏంజెల్స్ గెలుపొందాయి.గెలుపొందిన క్రీడాకారులు కి లక్ష్మి చారిటబుల్ పౌండేషన్ డైరెక్టర్ కొప్పర్ల దివాకర్ గారు మెడలతో,ట్రోఫీతో, సర్టిఫికెట్ అందించారు. కాగా అండర్ 14 లో ప్రథమ,అండర్ 17 లో తృతీయ స్థానాలో నిలచిన లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులను కరస్పాండెంట్ కె .రాజగోపాల్ రెడ్డి, చైర్పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ డాక్టర్ కేఆర్ శ్వేత అభినందించారు.అసోసియేషన్ ప్రతినిధులు దేవరాజ్, హేమంత్ కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

# కాళికాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు

విజయపురం, జూలై 30 ప్రభాతవార్త



మండలంలోని కాళికాపురం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సూపర్‌సిక్స్ పథకాలు వివరాలను తెలియజేశారు. అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, కపిల్, బాబు, దొరైరాజు, లక్ష్మయ్య, గ్రామస్తులు ఉన్నారు.

# దాతల సాయం అభినందనీయం

విజయపురం, జూలై 30 ప్రభాతవార్త:



దాతల సాయం అవినీతినీయమని ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు పేర్కొన్నారు. శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 4వ తరగతి విద్యార్థి రుత్విక్ తల్లిదండ్రులు చాందిని, లోకేష్‌లు పాఠశాలకు ఫ్యాన్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దాతృత్వ అలవరచుకోవాలని, పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, గ్రామస్తులు జ్యోతిలక్ష్మి, సురేష్, ఆనంద్, అముద, సుజాత, గంగోత్రి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు: సుధీర్‌రెడ్డి

వీఎం పల్లిలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభం

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పురపాలకసంఘాభివృద్ధికి ప్రత్యేక నిధుల సాధనకు కృషి చేస్తున్నామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.బుధవారం పట్టణంలోని వీఎంపల్లిలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగాలన్నది తమ అభిమతం అన్నారు.గతంలో తన తండ్రి శాసనసభ్యుడుగా ఉన్నపుడు పలుచోట్ల ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసిన ఒక్కరూపాయికే మినరల్ వాటర్ అందించారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నామన్నారు.ఐదేళ్ళుగా మున్సిపాలిటిలో పరిపాలనను గాలి వదలి పెట్టారని వైకాపా పాలనపై ధ్వజమెత్తారు. వచ్చిన నిధులను పప్పు బెల్లాలా పంచుకున్నారని వివరించారు. వీఎంపల్లిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఏ సమస్య ఉన్న తాను ఎంఎల్‌ఏ అని భయపడక ఎవరైనా రావచ్చునన్నారు..ఈ సందర్భంగా స్వచ్ఛమైన నీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు.వీఎంపల్లికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి రాగా పల్లికి చెందిన మహిళలుఇంటి సమస్యలను మొరబెట్టుకున్నారు.అలాగే విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలను 15రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్,కార్యదర్శి కాసరం రమేష్,పేట బాలాజి,షాకీర్‌అలి, రాంబాబు రాగా స్థానికులు గోపి,సన్ని,వవెంకయ్య,లక్ష్మణ్,రామకృష్ణల సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.

# శివయ్య సేవలో గాలి జనార్ధన్‌రెడ్డి

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో కర్నాటకకు చెందిన మాజీ మంత్రి,శ్రీకాళహస్తీశ్వరాలయానికి భూరి విరాళాలు అందించిన గాలి జనార్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులతో హాజరయ్యారు.వారికి ఆలయ మర్యాదలతో ఎఇఒ మోహన్,పిఆర్‌ఓ రవి, తెలుగుదేశం మీడియా ప్రతినిధి ఎం.దుర్గాప్రసాద్,బాలాజి, ఖాదర్‌లు స్వాగతం పలికారు.వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చసారు. దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలతో పాటు తీర్ధ ప్రసాదాలు అందించారు.

# వర్షాకాలం వస్తుంది!ప్రత్యేక నిధులిచ్చి ఆదుకోండి

కలెక్టర్‌కు ఎంఎల్‌ఏ వినతి

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం మున్సిపాలిటి గత15 సంవత్సరాలుగా మున్సిపాలిటి పరిధి బాగా పెరిగిందని రాజీవ్‌నగర్,ఎస్‌డికె నగర్,హౌసింగ్‌బోర్డు కాలనీ, బృందమ్మ కాలనీ, విశాలాక్షమ్మన గర్‌లో ఇలా ప్రతి వైపు పట్టణం బాగా పెరిగింది. అయితే మున్సిపాలిటిలో నిధుల కొరత శాపంగా ఉందని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్‌కు వినతి పత్రం అందించారు. బుధవారం ఎంఎల్‌ఏ కలెక్టర్ కార్యాలయంలో కలసి ప్రత్యేక నిధులుమ ంజూరు చేసిన వర్షాకాలం పనుల నిర్వహణకు సహాకరించాలని కోరారు.ముఖ్యంగా చెంబేడు కాలువ పనులు అర్ధాంతరంగా ఆగాయి. వర్షాకాలం వర్షపునీరంతా ఈ కాలువ ద్వార కన్నలి కాలువకు చేరేదని గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు కొంత మేరకు ఎస్‌సి యాక్షన్ ప్లాన్‌నిధులతో బాగు చేసారని తరువాత ఐదేళ్ళు పరిపాలించిన నాయకులు పట్టించుకోలేదని వివరించారు. అలాగే రాజీవ్‌న గర్‌లో ఎటు చూసినా సమస్యలే అని వివరించారు. లే అవుట్ కాలనీలో కనీస సదుపాయాల్లేక జనం తల్లడిల్లుతున్నారు. పురాతన కాలం నాటి మురుగునీటి కాలువలు నేటి అవసరాలను తీర్చలేకున్నాయని వివరించారు.ఇక రాజీవ్‌నగర్‌లో పైప్‌లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కొండమిట్టలో పైప్‌లైన్లుఅస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. మున్సిపాలిటి అభివృద్ధికి రాబోవు వర్షాకాలం పారిశుధ్యాన్ని అమలు పరచుటకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ఎంఎల్‌ఏ కోరారు.

# కలెక్టర్‌కు పేట వాసుల ఆహ్వానం

శ్రీకాళహస్తి,రూరల్ జూలై 30 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఆగస్టు 1 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్‌కు పేట వాసులు ఆహ్వాన పత్రికలను అందజేసారు.శ్రీకాళహస్తి నియోజ కవర్గంలోని శ్రీకాళహస్తిలోనూ, పాపానాయుడుపేటలో ధర్మరాజుల స్వామి ఉత్సవాలను బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఆగస్టు 10న అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు హాజరౌతారని కన్నుల పండువగా నిర్వహించే ఉత్సవాలకు అతిధిగా కలెక్టర్ రావాలని ఎం.దొరకృష్ణ,తెలుగుదేశం అధినేత జాఫర్‌లు ఆహ్వానించారు.అలాగే ఆహ్వాన పత్రికలను దేవాదాయశాఖ ఎసిలకు అందించారు.

# గుడిమల్లం ఆలయం వద్ద అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రణాళికలు

మైత్రీ ఎండి

శ్రీకాళహస్తిరూరల్,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తినియోజకవర్గంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయం కు భక్తులతో పాటు అతిధుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఇక్కడ నిత్యాన్నసత్రం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలో ఇటీవల మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కుమారుడు శ్రీకాంత్ షిండే రూ.50లక్షలు విరాళం అందించారు.అలాగే విశాఖలోని మైత్రి కన్‌స్ట్రక్షన్స్ ఎండి బాల పవన్‌ను ఆలయ ఇఒ మాజీ చైర్మెన్ కలిసి స్వామి వారి తీర్థ ప్రసాదాలనుఅ ందించారు. ఇఒ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు వేదపండితుడు పవన్ కుమార్ శర్మతో వెళ్ళి స్వామి వారి ప్రసాదాలను అందించారు. ఇక్కడ చేపట్టే నిత్యాన్నదాన పథకానికి భవన నిర్మాణానికి బాలపవన్ భూరి విరాళం అందిస్తారని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశాలతో ఇఒ మాజీ చైర్మెన్ విశాఖకు వెళ్ళి ఆయన్ను కలిసారు. త్వరలో చేపట్టనున్న నిత్యాన్న సత్రం నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు అందించారు. నిత్యాన్న సత్ర నిర్మాణంలో ప్రధాన భాగస్వాములౌతాయని మైత్రి ఎండి భరోసా ఇచ్చినట్లు సమాచారం.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణి

శ్రీకాళహస్తి,జూలై 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన వివిధ అంశాల్లో ఇబ్బందులు పడ్డ వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్ధిక సహా యాన్ని బుధవారం పార్టీ కార్యాలయంలో శాసన సభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సమాజంలో కార్పొరేట్ ఆసుపత్రుల నిలువుదోపిడికి గురౌతున్న వారిని ఆదుకొనుటకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏడాదిలో సుమారు 500 మందికి పైగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్ధిక సహాయం అందించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. బుధవారం రూ.22,30,783ల చెక్కులను అందించారు.ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు,స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# కార్వేటినగరం యస్.సి.హాస్టల్‌ను యంపిడిఓ తనిఖీ

కార్వేటినగరం,జూలై 30 ప్రభాతవార్త:

కార్వేటినగరం యస్.సి.హాస్టల్‌ను స్థానిక ఎంపిడిఓ చంద్రమౌళి బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.హాస్టల్ సిబ్బంది,హాస్టల్ విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఉదయం పిల్లలకు వడ్డించు అల్పాహారమును పరిశీలించారు. పిల్లలకు వడ్డించు ఆహార విషయంలో ప్రతిరోజు హాస్టల్ సిబ్బంది పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు.హాస్టల్ విద్యార్థులతో ప్రతిరోజు క్రమశిక్షణతో మెలగాలని,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు.ప్రతిరోజు ఉదయం 5గంటలకు నిద్రలేచి చదువుకొని జీవితంలో మంచిగా ఎదగాలని తెలియజేశారు. హాస్టల్ వార్డెన్,సిబ్బందితో ఏమైనా సమస్యలున్నాయా, ఇలాంటి విషయాలపై విద్యార్థులతో చర్చించారు.

# ఆలిండియా కరాటే ఛాంపియన్షిప్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి క్రీడ, జూలై 30, ప్రభాతవార్త



ఒంగోలులోని ఆనంద్ మినీ స్టేడియంలో ఆగస్టు 17వ తేదీన సిద్ధార్థ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీలను నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నల్లూరి మోహన్ రావు, అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఈ సం దర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడుని తిరుపతి లోని వారి కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వివరించడంతో పాటు ఆహ్వానించారు. అనంతరం నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్ ను శాప్ ఛైర్మన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్కెడీఏ సభ్యులు, అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

# దుర్గసముద్రంలో వేడుకగా అర్జున తపస్మాన్

తిరుపతిరూరల్, జూలై 30 ప్రభాతవార్త:



మహాభారతంలో అర్జున తపస్సు ఒక ముఖ్యమైన ఘట్టం. అర్జునుడు శివున్ని మెప్పించటానికి హిమాలయాల్లో తపస్సు చేసిన వైనాన్ని తెలియజేస్తుంది. ఈ తపస్సు ద్వారానే అర్జునుడు శివుని నుంచి పాశుపతాస్త్రం పొందాడు. ఈ ఘట్టాన్ని శ్రీవెంకటేశ్వర నాట్యమండలిచే ఘనంగా నిర్వహించారు. అర్జునుడు వేశధారణ ధరించిన కథా సారంశంతో పాచికలు ఆడి ధర్మరాజు సర్వసము పోగొట్టుకోవడమే. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచా యతీలో శ్రీద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో మహా భారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న విషయం తెల్సిందే. పాండవులు జూదంలో ఓడిపోయి, అడవికి వెళ్ళడం, శివుని పాటలు పటిస్తూ...ఒక్కో మెట్టుకు ఒక పాట పాడుతూ తమ వద్ద ఉన్న ఆయుధాలను జమ్మిచెట్టులో భద్రపరుస్తూ ఎక్కేటప్పుడు భక్తులకు నిమ్మ విభూధి భక్తులపై చల్లుతుండగా పిల్లలు లేనివారు అర్జునుడు విసిరిన విభూధితో భక్తులు ఆనందాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఉబయదారుడు జయసింహారెడ్డి, ఆలయ ధర్మకర్త, సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల విలీనాన్ని ఆపండి

కేవీబీ పురం, జూలై 30 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలంలో 44 పాఠశాలలను జీవో నెంబరు 117కు అనుకూలంగా 3,4,5 తరగతులను రద్దు చేసి 3 నుంచి 5 కి.మీ దూరంలో ఉన్న గ్రామాల్లోని పాఠశాలకు విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు సీపీఎం పార్టీ నాయకులు దాసరి జనార్ధన్, కమిటీ చైర్మన్‌లు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కేవీబీ పురం పర్యటనకు విచ్చేసిన జిల్లా ఉప విద్యాశాఖ అధికారికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మండలంలో 44 పాఠశాలల్లో 3,4,5 తరగతులను రద్దు పరచి 5 కి.మీ దూరంలో ఉన్న పాఠశాలలో విలీనం చేయడం దారుణమన్నారు. పాత పద్ధతిలోనే పాఠశాలలను కొనసాగించాలని సూరమాల పంచాయతీలో ఏపీ పురం, పాతపాళెం దళితవాడ గ్రామస్తులు ఆరోపించారు. మండలంలోని అత్యంత సమస్యాత్మకమైన గ్రామాలు గురుకుల కండ్రిగ, ఎస్ఎల్ పురం ఎస్టీ కాలనీ, బంగారం కండ్రిగ, జ్ఞానమ్మ కండ్రిగ, వగత్తూరు ఎస్టీ కాలనీలోనే పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

# పుత్తూరు మండల కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా మహేష్ ఎన్నిక

పుత్తూరు రూరల్, జూలై 30 ప్రభాతవార్త:

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ పుత్తూరు మండల కార్యదర్శిగా డి.మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పుత్తూరు అంబేద్కర్ భవనంలో ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ పుత్తూరు మండల నూతన కమిటీని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. పుత్తూరు మండల కార్యదర్శిగా మహేష్‌ను రెండో సారి ఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ సభ్యులుగా 13 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మండలంలో పేదలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తానని ఆయన అన్నారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# కేబీఆర్‌పురం గంగమ్మజాతరలో మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్, జూలై 30 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం కేబీఆర్ పురం గ్రామంలో గంగమ్మతల్లి జాతర మహోత్సవంలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. జాతర సందర్భంగా గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులు, స్థానికవైసీపీ నాయకులు ఆమెకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రోజా మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి విందు భోజనంలో పాల్గొన్నారు. పుత్తూరు మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మలబార్ గోల్డ్ డైమండ్స్‌లో వరలక్ష్మి వ్రతం పండుగ ఆఫర్లు

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త

తిరుపతి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ రెస్పాన్సిబుల్ జ్యువెలరీగా,ప్రపంచంలోనే అత్యంత విశ్వాసనీయ ఆభరణాల బ్రాండ్‌లో ఒకటిగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఎంతో పుణ్యప్రదమైన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భక్తిశ్రద్ధలతో,శాశ్వత సౌందర్యాలతో ఈ వేడుకలు జరుపుకోవడానికి వినియోగదారులను ఆహ్వానిస్తుంది.పవిత్రమైన ఈ పండుగను స్మరించుకుంటూ,మీ పండుగ వేడుకలకు మెరుపులు అద్దడానికి, ప్రతి పండుగకు ప్రాముఖ్యతను జోడించడానికి ఆలోచనాత్మకంగా రూపొందించబడిన 100 శాతం జెన్యూన్ ఆఫర్లను మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అందిస్తోంది. ఈ పండుగలో భాగంగా అన్ని బంగారం,అన్కట్ వజ్రాలు,రత్నాభరణాల తరుగు ఛార్జీలపై 30 శాతం ఫ్లాట్ తగ్గింపును వినియోగదారులు పొందవచ్చు. అదనంగా, వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది మలబార్, 2025 ఆగస్టు 8వ తేదీ వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి,నియమ నిబంధనలు,షరతులు వర్తిస్తాయి అని ఆ షో రూమ్ హెడ్ రేజిష్ తెలిపారు.

# మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు

తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త

ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్స వాన్ని పురస్కరిం చుకుని, జూలై 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రతి రైల్వే స్టేషన్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించదమైనది.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ పిల్లలు, మహిళలు ఈ అక్రమ రవాణా లో చిక్కుకుని అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.సమాజంలో జరుగుతున్నటువంటి దురాచారాన్ని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు.మానవ అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలు,అక్రమ రవాణాకు పాల్పడే వారికి విధించే కఠిన శిక్షల గురించి వివరించారు. సైబర్ నేరగాలని తప్పించుకోవడానికి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 సమాచారం అందించాలని తెలియజేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో సిడిపిఓస్ శాంతి దుర్గ,సుధారాణి, కృష్ణవేణి,ఆర్పిఎఫ్ ఎస్సై రామకృష్ణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ ఎల్లమ్మ తల్లి గ్రామోత్సవం.....

రేణిగుంట జూలై 30 ప్రభాతవార్త



ఱణిగుంట శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి ఊరేగింపు బుధ వారం రేణిగుంట పట్టణంలో ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని కన్నుల పండుగ అలంకరించి రేణిగుంట పట్టణంలోని ప్రధాన వీధుల్లో భాజా భజంత్రీలు, మేళ తాళాలు, బాణసంచా వేడుకలతో ఊరేగించారు. దారి పొడవున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఇంటి వద్ద ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఏలుమలై రెడ్డి, తులసి రెడ్డి, సరసమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిలిపి భక్తులు ఇచ్చిన నైవేద్యాన్ని అమ్మ తల్లికి సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. ఊరేగింపుతో అమ్మవారి జాతర తంతు ముగిసింది.

**CHANGE OF NAME**

I,DASARI AMMULU (Old Name) W/o TAMADA SOMESH H.NO=19-12-302, BAIRAGIPATTEDA,PADMAVATHIPARK 2nd Street, TIRUPATI (URBAN),TIRUPATI DIST.AP.PIN=517501, CHANGING MY NAME FROM DASARI AMMULU(OLD NAME) TO TAMADA ANU (NEW NAME) HENCE FORTH I AM BEING CALLED AS TAMADA ANU FOR ALL PURPOSES

# యువతకు నైపుణ్య శిక్షణ

**- తిరుపతి జిల్లాలో ఇండస్ట్రీ 4.0 అమలుపై స్పష్టత ఇవ్వాలి**
**- పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి**



వెంకటగిరి, జూలై 30 ప్రభాతవార్త: ఆధునిక సాంకేతిక రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణ కోసం కేంద్ర బడ్జెట్లో ప్రవేశ పెట్టిన ఇండస్ట్రీ 4.0 అమలు కోసం తీసుకుంటున్న చర్యలపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం లోక్‌సభలో వివరాలు కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా తిరుపతి జిల్లాలో ఇండస్ట్రీ 4.0 ఆధారిత శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయా, ఐజర్, ఎస్వీ యూనివర్సిటీ, లేదా ఇతర నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు ఈ రంగాల్లో శిక్షణ అందించేందుకు ఎంపికయ్యాయా, తిరుపతి వంటి జిల్లాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పరిశ్రమకు మద్దతు, ప్రోత్సాహకాలు ఇచ్చారా, ఇండస్ట్రీ 4.0, డిజిటల్ తయారీ వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా తిరుపతి యువతకు ప్రత్యక్ష లాభాలు వచ్చేలా కేంద్రం ఎటువంటి ప్రణాళికలు రూపొందించిందో వివరాలు కావాలని కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ప్రోగ్రామ్ కింద 2.79 లక్షలకు పైగా అభ్యర్థులను చేర్చుకుందని, ఈ కార్యక్రమం నాస్కామ్ తో సహకారంతో నడుస్తోందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్, త్రీడి ప్రింటింగ్, సైబర్ సెక్యూరిటీ మొదలైన అభివృద్ధి చెందుతున్న సాంకేతికత లలో అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం పేర్కొన్నారు. ఇటీవల తిరుపతిలో ఎంపి గురుమూర్తి కృషితో ఏర్పాటు చేయబడిన నైలెట్ కేంద్రాన్ని స్థాపించిన విషయం అందరికి విదితమే, ప్రస్తుతం తిరుపతి నైలెట్ కేంద్రంలో పైన పేర్కొన్న కోర్సులే కాకుండా పైథాన్ ప్రోగ్రామింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి కార్యక్రమాలను అందిస్తోందని తెలియ జేసారు. తిరుపతిలోని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ కేంద్రంలో స్థానిక ఐటి పరిశ్రమ, స్టార్టప్‌లు, వాటి వ్యవస్థాపకులకు ఇంక్యుబేషన్ సేవలతోపాటు పలు సేవలను అందిస్తోందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు ఏర్పాటు చేసిందని ఇందులో తిరుపతి జిల్లా సత్యవేడు మండలం, చెరివి గ్రామంలో, ఏర్పేడు మండలం, వికృతమాల గ్రామం, రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలోని తిరుపతి విమానాశ్రయం సమీపంలో, వైఎస్సార్ కడప జిల్లా, కొప్పర్తిలో సుమారు 62 కంపెనీలు రూ. 6,421 కోట్లతో 59,694 మందికి అదనపు ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలియజేసారు. ప్రభుత్వం 2021లో విశాఖపట్నంలో ఇండస్ట్రీ 4.0పై కల్పతరు సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ని స్థాపించింది. ఇప్పటి వరకు, కల్పతరు 45 స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చిందని తెలియజేసారు.

## అనుమానస్పదంగా మహిళ మృతి



గూడూరు, జూలై 30 ప్రభాతవార్త: అనుమానస్పదంగా మహిళ మృతి చెందిన సంఘటన గూడూరు మండలంలోని ఇందిరమ్మ కాలనీ 5వ వీధిలో చోటు చేసుకుంది. గూడూరు సిఐ ఎన్.కిషోర్ బాబు, ఎస్ఐ మనోజ్ కుమార్‌ల వివరాలు మేరకు ఇలా ఉన్నాయి. మృతి చెందిన మహిళ షేక్ సాహెరా భాను (33) నలజాలమ్మ వీధి నందు కాపురముంటుంది. ఆమె పసుపు, ఆరెంజ్ రంగు గల పంజాబీ చూడీధార్, ఎరుపు రంగు ప్యాంట్ ధరించి వుంది. మృతురాలు వద్ద హీరో బ్లూ రంగు కీప్యాడ్ సెల్ లభించింది. ప్రస్తుతం మృతదేహం గూడూరు ప్రభుత్వాసుపత్రి నందు ఉందని తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సిఐ కిషోర్ బాబు 9440796341, ఎస్ఐ ఎం. మనోజ్‌కుమార్ 9440796344 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## అత్యవసర వైద్య సేవల పట్ల అవగాహన ఉండాలి



గూడూరు, జూలై 30 ప్రభాతవార్త: అత్యవసర వైద్య సేవల పట్ల పీఎంపీలు అవగాహన కలిగి ఉండాలని కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) గూడూరు, నాయుడుపేట డివిజన్ ఉపాధ్యక్షులు చిరమన సాయిమురళి అధ్యక్షతన గూడూరు పట్టణంలోని మాయాబజారు రోడ్‌లోని కెవి హాస్పిటల్స్ సమావేశ మందిరము నందు కిడ్నీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ మూత్రపిండ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాఘవేంద్ర మాట్లాడుతూ పీఎంపీలు మూత్రపిండ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేసి వారు కిడ్నీ వ్యాధి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. నారాయణ హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వి.ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ ట్రబుల్‌కు సంబంధించి పండ్లు, ఆకుకూరలు తీసుకుంటు న్నట్లయితే వ్యాధి ప్రబలకుండా ఉంటుందని తెలియజేశారు. అనంతరం పీ.యం.పీ నాయకులు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, కె.వి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ కీర్తిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ ఏవో వెంకటేశ్వర్లు, డివిజన్ పిఎంపి నాయకులు సి.సాయిమురళి, షేక్ కరీముల్లా, ఈ.సాంసన్, పి.చంద్రమోహన్, టి.శంకరమ్మ, డి.కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో నగదు జమ



కోట, జూలై 30 ప్రభాతవార్త: అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగస్టు 2న రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తాయని మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం కోట మండలం సిద్ధవరం, కొత్తపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఒక్కో రైతుకి రూ.5 వేలు, కేంద్రప్రభుత్వం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు ఖాతాల్లో జమ చేస్తాయని తెలిపారు. మండలంలో 5,500 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం కింద గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి సాయి, రైతులు పాల్గొన్నారు.

## ప్రజాదరణ కలిగిన జగన్ అంటే భయమెందుకు : ఎంఎల్‌సీ



కోట, జూలై 30 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రభుత్వానికి ఎందుకు భయమని గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్ ప్రశ్నించారు. ఆయన బుధవారం కోట మండలం విద్యానగర్‌లో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు అభిమానులు, కార్యకర్తలు తరలి వస్తుంటారని చెప్పారు. ప్రభుత్వం ఎందుకు ఆంక్షలు విధిస్తుందో అర్థం కావడం లేదన్నారు. గురువారం ఉదయం తాడేపల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 10 గంటలకు నెల్లూరు సెంట్రల్‌జైలు వద్దకు జగన్‌మోహన్‌రెడ్డి చేరుకుంటారన్నారు. రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ములాఖత్ ద్వారా కలుసుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుంచి నెల్లూరులో మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళతారని తెలిపారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై ఇటీవల రౌడీమూకలు దాడి చేసిన నేపథ్యంలో, ఆయనకు సంఘీభావం తెలుపుతారన్నారు. ఆయన వెంట కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, చిట్టమూరు మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ పాముల సురేంద్ర తదితరులు ఉన్నారు.

## పారదర్శకంగా ఇంటింటి సర్వే చేయండి : ఎంపిడిఓ



కోట, జూలై 30 ప్రభాతవార్త: ప్రజల ఆస్తులను గ్రామ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వేను పారదర్శకంగా చేయాలని ఎంపిడిఓ వేణు కోరారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో స్వమితమిత్రలో భాగంగా ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామకంఠాల్లో ఉన్న భూములను కూడా సమగ్ర సర్వే జరపాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## పి4 సర్వేపై సచివాలయ సిబ్బందితో సమావేశం



వాకాడు, జూలై 30 ప్రభాతవార్త: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పి ఫోర్ సర్వే యొక్క స్థితిని గురించి చర్చించారు. తిరుపతి జిల్లా గౌరవ కలెక్టర్ మండలానికి మొత్తం 1979 పేదలని గుర్తించి దానిలో 1548 మందిని లక్ష్యంగా చేసుకొని దత్తత కార్యక్రమాన్ని పూర్తి చేయవలసిందిగా తెలిపారు. ఇప్పటివరకు మండలంలో ఉండేటువంటి ఉన్నత కుటుంబాలలో (మార్గదర్శి) 97 మందిని గుర్తించి వారికి 641 (బంగారు కుటుంబాలు) మందిని అటాచ్ చేయడం జరిగిందని ఈ సమావేశం సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ రఫీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టంపై విస్తృత అవగాహన

**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**



చిత్తూరు, జూలై 30 ప్రభాతవార్త: తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007, ట్రాన్స్‌జెండర్ హక్కుల చట్టం-2019 అమలుపై ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమశాఖ ఎడి వినోద్‌కుమార్, డిఎస్పీ సాయినాథ్, డిప్యుటీ కలెక్టర్ అనుపమ, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, సీనియర్ లాయర్ సుజాత, మహిళా విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేని కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. శ్రీమంతుల కుటుంబాల్లో కూడా ఇలాంటి పరిస్థితి చూస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణలో ఆయా కుటుంబసభ్యుల బాధ్యత వహించాల్సి వుందని, తల్లిదండ్రులతో సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన నుంచి లేదా అతని స్వంత ఆస్తి నుండి తనను తాను కాపాడుకోలేకపోయినప్పుడు ప్రాథమికంగా ఆర్డీఓ అధ్యక్షతన వున్న ట్రిబ్యూనల్‌కు ఫిర్యాదు చేయవచ్చు నని, ఆర్డీఓ ద్వారా నోటీసులు అందించి విచారణ చేసి సమస్యను సానుకూలంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. సామరస్యంగా పరిష్కారం కాని సమస్యలకు చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కుమారులపైన, కుమార్తెలపైన చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతు౦దన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ సిటిజన్లు, తల్లిదండ్రులకు ఆహారం, వైద్యం, వసతి తదితర ప్రాథమిక అవసరాలను నెరవేర్చలేని వారి వారసులకు తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007 ప్రకారం మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా 5 వేల రూపాయల జరిమానా విధిస్తారన్నారు. సీనియర్ లాయర్ సుజాత మాట్లాడుతూ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ కోసం రాజ్యంగంలో ఆర్టికల్ 41 ద్వారా చట్టాలు చేసుకునే అవకాశం వుందని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లు, తల్లిదండ్రుల సంక్షేమం వారి వారసుల బాధ్యత చేస్తూ దేశంలో చట్టపరంగా సమర్థవంతమైన నిబంధనలు అందించడం జరిగిందన్నారు. మహిళా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ హక్కుల చట్టం-2019 ద్వారా ట్రాన్స్ జెండర్‌లకు హక్కులు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని అమలు చేయడంలో జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

## రోజ్‌గార్ యోజన పథకంపై అవగాహన సదస్సు



సత్యవేడు, జూలై 30 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎం-వీబీఆర్‌వై) పథకంపై అవగాహన సదస్సును శ్రీసిటీలో నిర్వహించారు. యువతకు ఉపాధి లక్ష్యంగా ఎంప్లాయ్‌మెంట్ లింక్ట్ ఇన్సెంటివ్ ప్రోగ్రామ్(ఈఎల్ఐ) అని కూడా పిలిచే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించింది. దీని పట్ల అవగాహన పెంచడం, సమర్థవంతంగా అమలు చేసేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఇందులో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో)కు చెందిన ఉన్నతాధికారులు, శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈపీఎఫ్‌వో అధికారులు పీఎం-వీబీఆర్‌వై పథకంపై సమగ్ర వివరణ ఇచ్చారు. ముఖ్యంగా తయారీ రంగంలో భారీగా ఉద్యోగాల సృష్టి, కంపెనీ యాజమాన్యాలు, కొత్త ఉద్యోగులకు అందించే ఆర్థిక ప్రోత్సాహకాల గురించి హైలెట్ చేశారు. ఉపాధిని ప్రోత్సహించడానికి రూపొందించిన వేతన-సంబంధిత ప్రోత్సాహకాలను, తప్పని సరి ఈపీఎఫ్‌వో నమోదు ఆవశ్యకత గురించి వివరించారు. ఇంకా ఈ పథకం కింద లభించే వివిధ ప్రయోజనాలను సమర్థవంతంగా, పారదర్శకంగా పంపిణీ చేయడానికి ఆధార్-ఆధారిత ప్రత్యక్ష బదిలీ(డీబీటీ) వినియోగాన్ని విశదీకరించారు. తయారీ రంగ యాజమాన్యాల కోసం రూపొందించిన ప్రత్యేక నిబంధనలను కూడా వివరించారు. అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్(ఏపీ) వీరభద్రస్వామి, ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-1(కడప) రవితేజరెడ్డి, ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 (తిరుపతి) సతీష్‌కుమార్, ఇతర సీనియర్ ఈపీఎఫ్‌వో అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, పరిశ్రమల ప్రతినిధులను సాదర స్వాగతం పలుకగా, శ్రీసిటీ మేనేజర్ ప్రతినిధి వి.శివకుమార్ సదస్సు లక్ష్యాలను వివరించారు. సుమారు 60 మంది పరిశ్రమ ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ఈ తరహా పలు మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ తమకు తగు ప్రోత్సాహం అందిస్తున్న శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఊరేగిన పాలేటి గంగమ్మ



సోమల, జూలై 30 ప్రభాతవార్త: నెల్లిమంద సమీపంలో వెలసిన పాలేటి గంగమ్మ ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు సోమల పురవీధుల్లో ఊరేగారు. అమ్మవారికి పుట్టినిల్లుగా భావించే పాయల వంశస్తుల కుటుంబాలకు ఆమె విచ్చేసి వారి నుంచి చీర సారె స్వీకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి పలుమార్లు అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి కోసం ప్రత్యేకంగా తయారుచేసిన కొమ్ము, డప్పు వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. అమ్మవారు ఊరేగింపు సందర్భంగా పలువురు భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. పాయల వంశస్థులు నాగరాజ, రమేష్, అమరనాథ్, శివకుమార్, గంగాధర్, జగన్మోహన, వరదం రమణ, ఎంపీటీసీ సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణలను తొలగించాలి

సదుం, జూలై 30 ప్రభాతవార్త



మండల పరిధిలోని కంభం వారి పల్లె పంచాయతీ గాండ్లపల్లి వద్ద ఉన్న నాగులకుంట కడియాల కుంటల ఆక్రములను తొలగించాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం గాండ్లపల్లె దళితవా డలో జాతీయ పౌర హక్కుల దినోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నాగుల కుంటలో మూడు ఎకరాల 30 సెంట్లు ఉంటే మూడు ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. ప్రస్తుతం కేవలం 30 సెంట్లు మాత్రమే ఉందన్నారు. అదేవిధంగా కడియాల కుంట కూడా ఆక్రమణలో ఉందని వర్షం పడితే చెరువులు నిండుతాయని ఆ చెరువుల్లో నీరంతా పట్టా భూములపై వెళ్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చెరువుల్లో తమకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని కోరారు. అదేవిధంగా స్మశాన వాటికలు కూడా ఆక్రమణలో ఉన్నాయని చెప్పారు. గతంలో తమ గ్రామస్తులకు చింత చెట్లకు పట్టాలు ఇచ్చారని పట్టాలు ఉన్నా కూడా చెట్లని నరికివేసి అమ్ముకుని ఆ భూములను కూడా గ్రామంలో కొంతమంది ఆక్రమించుకున్నారని చెప్పారు. అదేవిధంగా దళిత వాడలో ఐదు సంవత్సరాల క్రితం విద్యుత్ స్తంభాన్ని నాటారని కనెక్షన్ ఇవ్వమని అడిగితే ఇదిగో అదిగో అని చెబుతూ తప్పించుకు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొంతమంది తమకు తల్లికి వందనం డబ్బులు పడటం లేదని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సింహం గుండ్ల చెరువు కింద పలువురికి భూములు పోయాయని వాటికి ఇప్పటివరకు నష్టపరిహారం అందజేయలేదని ఫిర్యాదు చేశారు. సమావేశంలో ఎస్సై షేక్షావలి,తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఎస్సీ సంక్షేమ వసతి గృహం సంక్షేమ అధికారి భాష, పౌర హక్కుల సంఘం నేత సీతాపతి, పలువురు పాల్గొన్నారు.

## మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్



తిరుపతి విద్య, జూలై 30 ప్రభాతవార్త : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 2028వ సంవత్సరం వరకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్ బీ ఎ) గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా టిటిడి ఈవో శ్యామలరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషితో నేషనల్ బోర్డ్ అక్రెడిటేషన్ గుర్తింపు లభించిం దన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో మరింతగా శ్రమించి జాతీయ స్థాయిలో కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని, మరింత నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. గత నెలలో న్యూఢిల్లీ నుండి విచ్చేసిన ఎన్ బీ ఏ నిపుణుల బృందం కళాశాలలోని ప్రయోగశాలలు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలు,రికార్డులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు.కళాశాలలో బోధన, ల్యాబ్స్, లైబ్రరీ,తదితర అంశాలపై విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించారు.నేషనల్ బోర్డ్ నిబంధనల మేరకు పాలిటెక్నిక్ కళాశాలను నిర్వహిస్తుండడంతో ఎన్ బీ ఏ గుర్తింపు ఇచ్చారు.

# గూడూరు డివిజన్

## పంటల బీమా నమోదు చేసుకోండి



పెళ్లకూరు, జూలై 30 ప్రభాతవార్త : మండలంలోని తాల్వాయిపాడు గ్రామంలో బుధవారం నాడు నాయుడుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుందిరా! కార్యక్రమం నిర్వహిoచడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంటలేసిన ప్రతి రైతు పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. దీనివలన రైతులకు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం సులభంగా పొందవచ్చును అన్నారు. దీంతోపాటుగా ప్రభుత్వం అందించే సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను రైతులు పొందుటకు వీలు పడుతుంది అన్నారు. అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతి రైతు పీఎండీఎస్ కిడ్స్ తమ పొలాల్లో ఒక ఎకరానికి 10కేజీల చొప్పున చల్లుకుని భూసారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో విజయభారతి సర్పంచ్ వీర కుమార్ ఏఈఓఎస్ పుట్టయ్య అశోక్‌లతో పాటు పెళ్లకూరు నాయుడుపేట మండలాలకు సంబంధించిన ప్రకృతి వ్యవసాయలో వివిధ కేడర్లకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు

## మానవ అక్రమ రవాణాపై అవగాహన



చిల్లకూరు, జూలై 30 ప్రభాతవార్త: కోట క్రాస్ రోడ్డు ప్రాంతంలో ఏర్పటై ఉన్న అపెక్స్ పరిశ్రమలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బివి. సులోచన రాణి మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి గీతా కుమారి, ఎస్సై సురేష్ బాబు, ప్యానల్ అడ్వకేట్స్ అరవ పార్వతయ్య, మహబూబ్ బాషా, అపెక్స్ పరిశ్రమ హెచ్.ఆర్ మేనేజర్లు శైలజ, షరీఫ్, పి.ఆర్.ఓ మోహన్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 473వ నేత్రదానం



సూళ్లూరుపేట, జులై 30 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు బుధవారం 473వ నేత్రదానం అందింది. పట్టణంలోని జిఎన్‌టి రోడ్డులో నివసిస్తున్న కె.చంద్రయ్యనాయుడు (76) మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## శివయ్య హుండీ రాబడి రూ.2.69కోట్లు

**రికార్డు స్థాయంలో హుండీ ఆదాయం: ఇఓ**



శ్రీకాళహస్తి, జూలై 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం హుండీ ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నాయని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం నుంచి మందుకొట్టు మండపంలో హుండీల కౌంటింగ్ నిర్వహించారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు రూ.2కోట్లు 68లక్షల 87వేల 640లు వచ్చినట్లు ఇఓ వివరించారు. ఈనెల అనుబంధ ఆలయాల హుండీలను కూడా లెక్కించాల్సి ఉందన్నారు. ఆదాయాలు రూ.2.69 కోట్లు దాటవచ్చునని ఇఓ బాపిరెడ్డి అభిప్రాయ పడ్డారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలు సంస్కరణలతో ఆదాయాలతో పాటు హుండీల్లో వస్తున్న ఆదాయాలు గణనీయంగా పెరుగుతుందని వివరించారు. ఆలయంలో దళారులను కట్టడి చేసామని అలాగే ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించాలనే నిబంధనలతో రాబడి పెరిగిందన్నారు. హుండీల్లో నగదుతో పాటు బంగారు 0,97.300 గ్రాములు వచ్చిందని, వెండి నాగపడగల రూపంలో 882.250 కిలోలు వచ్చిందన్నారు, విదేశీ కరన్సి 235నోట్లు వచ్చిందన్నారు. హుండీల లెక్కింపు 40 రోజులకు సంబంధించిందన్నారు. రాబోవు రోజుల్లో ఇంకా హుండీల ఆదాయాలు పెరుగుతాయని ఇఓ బాపిరెడ్డి వివరించారు. హుండీల లెక్కింపును ఇఓ బాపిరెడ్డి,డెప్యూటి ఇఓ కృష్ణారెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కలశ స్థాపన



పుత్తూరు రూరల్, జూలై 30 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాలకు వాస్తు శాంతి అంకురార్పణ విఘ్నేశ్వర పూజ శ్రీద్రౌపదీదేవికి శ్రీ ధర్మరాజుల స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు, పాల కలశాలు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వివిధ పుష్పాలతో అలంకరించి విద్యుత్ దీపాలంకరణతో మంగళ వాయిద్యాలు నడుమ పురవీధుల్లో శ్రీ వినాయక స్వామిని ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## ఇదీ శాస్త్రవేత్తల విజయపరంపర

**-నిసార్ ఉపగ్రహం విజయవంతంతో సంబరాలు**



తిరుపతికార్పొరేషన్,జూలై 30ప్రభాతవార్త: ఇస్రో శాస్త్రవేత్తల మేథోసంపత్తితోనే నిసార్ ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించారని కూటమి పార్టీల నేతలు సంబరాలు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం శ్రీహరికోట నుండి ప్రయోగించిన జిఎస్ఎల్వి నిసార్ ఉపగ్రహం వాతావరణ పరిశీలన కోసం పంపడం, ఇదీ విజయవంతం కావడంతో ప్రపంచం గర్వించదగిన విషయమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తూ భారత్ మాతాకీ జై అంటూ కూటమిపార్టీల నేతలు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, ఏవన్‌మస్తాన్, జయంత్‌కుమార్, సిద్దేంద్రశర్మ, కోటేశ్వరరావు, సునీల్‌కుమార్, లోకప్రభాకర్‌నాయుడు, జగదీశ్ తదితరులు త్రివర్ణ పతాకాలను చేతబట్టి సంబరాలు జరుపుకున్నారు.

## లక్ష్మీభారతి సంతాప సభకు విచ్చేసిన పలువురు



పాకాల, జూలై 30 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం ఆదేనపల్లి పంచాయతీ పరిధిలోని పులివర్తి వారిపల్లిలో బుధవారం ఉదయం పులివర్తి లక్ష్మీభారతి సంతాపసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని మా తల్లికి పుష్పాంజలి ఘటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, తమ తల్లికి అభిమానంతో నివాళులర్పించిన అధికారులు, బంధువులు, స్నేహితులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ప్రతి ఒక్కరికి మా కుటుంబం తరుపున మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

## మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**



గుడిపాల, జులై 30 ప్రభాతవార్త: మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. గుడిపాల సిఎల్ఎఫ్ నందు కమ్యూనిటీ నిర్వహణ కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముదలు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడిపాలలో కమ్యూనిటీ నిర్వహణ శిక్షణ కేంద్రంను ప్రారంభించడం జరిగిందని, ఈ శిక్షణా కార్యక్రమంలో మహిళలకు రాష్ట్ర స్థాయి నుండి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. చిత్తూరు నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున నిధులు మంజూరు అవుతున్నాయని, తద్వారా నగరంను మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కనీసం ఒక మహిళా వ్యాపారవేత్త వుండేలా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధిని సాధించడమే ఈ శిక్షణ కేంద్రం నిర్వహణ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.